సాక్షి ప్రకాశం

సోమవారం । 26 । జూన్ । 2023



ప్రాణాలు..నీటి బుడగలు

ఈత సరదా ఎంతో మంది ప్రాణాలు తీస్తోంది. కడలి అలలు, వాగులు, కాలువలు చూడగానే ఈతకొట్టాలని ఆశపడేవారు కొందరు సరిగా ఈతరాక ఆ నీటికే బలవుతున్నారు. - 8లో..



ముండ్లపాడులో వ్యక్తి హత్య

గిద్దలూరు మండలం ముండ్లపాడులో పశువుల దళారీగా పనిచేసే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో కొట్టి హత్య చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 35 /27

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నాడు స్కాములు... నేడు స్కీములు

- మహాజన సంపర్క్ అభియాన్‌లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి




మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి

ఒంగోలు: 2014కు ముందు కాంగ్రెస్ పాలన అంతా స్కాముల మయం అని, నేటి బీజేపీ ప్రభుత్వం స్కీముల మయంగా మారిందని భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీవిష్ణుప్రియ ఫంక్షన్ హాలు ఆవరణలో మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రాంత గృహావసరాలకు రూ.18,645 కోట్లు కేంద్రం మంజూరు చేసిందని, సుకన్య సమృద్ధి యోజన ద్వారా 15 లక్షలకుపైగా బాలికలకు బ్యాంకు ఖాతాలు ప్రారంభించారన్నారు. ప్రజారోగ్యం కోసం శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేశారన్నారు. అసంఘటిత రంగ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గురించి వివరించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా కుళాయి కనెక్షన్లు తదితరాలు, ఆయుష్మాన్ భారత్ పథకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆర్టికల్ 370 రద్దు తరువాతే రాహుల్ గాంధీ అక్కడ స్వేచ్ఛగా చుక్క రక్తపాతం లేకుండా పర్యటన చేయగలిగారన్నారు. కేంద్రం ప్రవేశపెడుతున్న పథకాలపై, గత ప్రభుత్వాల అవినీతిపైన బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మాట్లాడుతూ అందిస్తున్న సుపరిపాలనే లక్ష్యంగా పార్టీని ఆశీర్వదించమని ప్రజలను కోరతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్, జిల్లా ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు పీవీ కృష్ణారెడ్డి, ఒంగోలు అసెంబ్లీ ఇన్‌ఛార్జి యానం చినయోగయ్య యాదవ్ , బి.ఆంజనేయులు, సెగ్గెం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంజాయి, హెరాయిన్, కొకైన్ లాంటి మత్తుపదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి. ఈ మత్తుకు అలవాటుపడిన వారు బయటకు రాలేక విలవిల్లాడిపోతున్నారు. ప్రధానంగా విశాఖ ఏజెన్సీ, నల్లమల అటవీ ప్రాంతం నుంచి గంజాయి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతున్నట్లు గుర్తించిన పోలీసులు నిఘాపెట్టి పలువురిని అరెస్టు చేసి జైలుకు పంపి, చైన్ లింకులను కట్ చేశారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిని బయటకు తెచ్చేందుకు డ్రగ్ ఎడిక్షన్ సెంటర్లను పెట్టి మానసికంగా చికిత్స అందిస్తున్నారు. మిగిలిన డ్రగ్స్ కంటే గంజాయి సులభంగా దొరుకుతుండటంతో ఈ వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

మత్తు దిగేలా సంకల్పం



గంజాయి మొక్కలు

- గంజాయి, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం
- 5 నెలల్లో 23 కేసులు, 72 మంది అరెస్టు
- 450 కిలోల గంజాయి స్వాధీనం
- ఇద్దరు మహిళలపై పీడీ యాక్టు నమోదు
- సంకల్పం ద్వారా పరివర్తనకు చర్యలు

మార్కాపురం: యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్‌పై జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ దృష్టి సారించింది. ముఖ్యంగా మానసిక ఒత్తిడి, దురలవాట్లకు దగ్గరైన వారిని గుర్తించి వారి బలహీనతను సొమ్ము చేసుకుంటూ గంజాయి అమ్ముతున్న పలువురు నేరస్తులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గంజాయి సరఫరా చేస్తున్న వారితోపాటు స్థానికంగా అమ్మే పలువురిని గుర్తించి కటకటాల వెనక్కు పంపారు. సంకల్పం కార్యక్రమం ద్వారా గంజాయి తీసుకునేవారు, అమ్మేవారిలో మార్పు తెచ్చేందుకు సెబ్ అధికారులు కృషి చేస్తున్నారు. ప్రధానంగా విశాఖ ఏజెన్సీ నుంచి, నల్లమల అటవీ ప్రాంతం నుంచి గంజాయి సరఫరా అవుతోంది. ఆటోలు, రైళ్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గంజాయి రవాణాదారులు తెలివిగా 2, 3 గ్రాముల పొట్లాలను తయారుచేసి మహిళలతో అమ్మిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వారిని కూడా అరెస్టుచేసి జైలుకు పంపారు. ప్రతి ఏడాది జూన్ 25వ తేదీన మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా యాంటీ డ్రగ్స్ డే నిర్వహిస్తున్నారు. డ్రగ్స్ వాడకం, అమ్మకానికి వ్యతిరేకంగా విద్యార్థుల్లో, ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపడుతున్నారు.

6 నెలల వ్యవధిలో 72 మంది అరెస్టు

గంజాయి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించిన సెబ్ సిబ్బంది, పోలీసులు దాడులు చేసి జిల్లా వ్యాప్తంగా మార్కాపురం, యర్రగొండపాలెం పెద్దదోర్నాల, ఒంగోలు, చీమకుర్తి, సింగరాయకొండ, కనిగిరి, పొదిలి తదితర పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ 72 మంది గంజాయి స్మగ్లర్లను, రవాణాదారులను అరెస్టుచేసి 450 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను జైలుకు పంపారు. ఇందులో ఇద్దరు మహిళలపై పీడీ యాక్టు నమోదు చేశారు.

- ఈ ఏడాది జనవరి 3వ తేదీ కనిగిరి సమీపంలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి ఒక టూవీలర్‌ను స్వాధీనం చేసుకుని 1.75 కిలోల గంజాయిని పట్టుకున్నారు.
- జనవరి 9వ తేదీన యర్రగొండపాలెం మండలం పాలుట్లలో 35 గంజాయి మొక్కలను ధ్వంసం చేసి తగులబెట్టారు.
- అదే రోజున బొమ్మలాపురం అటవీ ప్రాంతంలో మిర్చిమాటున సాగు చేస్తున్న 45 గంజాయి మొక్కలను గుర్తించి నిందితుడిని అరెస్టుచేసి ఆ మొక్కలను తగులబెట్టారు.
- ఈ ఏడాది ఏప్రిల్ 6న మార్కాపురం పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేశారు.
- జిల్లాలో గంజాయి విక్రయిస్తున్న ఒక మహిళతోపాటు మరోవ్యక్తిని అరెస్టు చేసి పీడీ యాక్టు కింద జైలుకు పంపారు.
- ఒంగోలు సమీపంలో షేక్‌బాజీని అరెస్టు చేసి 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

యువతపై ప్రత్యేక దృష్టి:

డ్రగ్స్ వాడకంలో యువత ఎక్కువగా ఉన్నట్లు గుర్తించిన పోలీసులు డ్రగ్స్ వాడకం వలన వచ్చే అనర్థాలపై వివరించేందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల్లో సెబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మొత్తం 192 కళాశాలల్లో విద్యార్థినీ విద్యార్థులకు డ్రగ్స్ వాడటం వలన వచ్చే మానసిక, శారీరక సమస్యలపై విస్తృతంగా ప్రచారం చేశారు. డాక్టర్లతో సెమినార్లు నిర్వహించారు. వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీల ద్వారా అవగాహన కల్పించారు. శారీరక, మానసిక సమస్యలతోపాటు కిడ్నీ, లివర్ దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.



డ్రగ్స్ వాడకం వలన వచ్చే అనర్థాలను వివరిస్తున్న సీఐ భీమా నాయక్



బొమ్మలాపురంలో గంజాయి మొక్కలను తగులబెడుతూ..

జిల్లా వ్యాప్తంగా నిఘా



డ్రగ్స్ సరఫరా, వాడకంపై జిల్లా వ్యాప్తంగా నిఘాపెట్టాం. ఇద్దరిపై పీడీ యాక్టు నమోదుచేసి జైలుకు పంపాం. మరో ఆరుగురిపై పీడీ యాక్టు అమలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. స్నేహితుల ఒత్తిడితో, ఫ్యాషన్‌తో గంజాయి తీసుకోవడం వలన కిడ్నీ, లివర్ ఫెయిల్ కావడంతోపాటు కుటుంబ సభ్యులకు, సమాజానికి దూరం కావాల్సి వస్తుంది. సంకల్పం కార్యక్రమం ద్వారా డ్రగ్స్ సప్లయర్స్‌లో మానసిక పరివర్తనకు కృషిచేస్తున్నాం. ఇప్పటికే సప్లయర్స్‌ను గుర్తించి కేసులు నమోదుచేసి జైలుకు పంపాం. గంజాయి సప్లయి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్పీ మలికా గర్గ్

డ్రగ్స్‌కు దూరంగా ఉండండి



యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. జిల్లా వ్యాప్తంగా 197 కళాశాలల్లో డ్రగ్స్ వాడకానికి వ్యతిరేకంగా సదస్సులు పెట్టాం. శారీరకంగా వచ్చే ఇబ్బందులను వివరించాం. ఒంగోలు, కనిగిరి, పొదిలిలో పలువురిని అరెస్టు చేసి జైలుకు పంపాం. త్వరలో మరికొందరిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నాం. డ్రగ్స్ సప్లయర్స్‌పై క్రిమినల్ రికార్డు ఫైల్ చేస్తున్నాం. యువత డ్రగ్స్ సరఫరా చేస్తే భవిష్యత్తులో పోలీసు కేసులు నమోదై ఉద్యోగాలు రావు.

– ఆవులయ్య, సెబ్ సూపరింటెండెంట్, ఒంగోలు.

పశ్చిమ ప్రకాశంపై నిఘా



పశ్చిమ ప్రకాశంలో మార్కాపురం, యర్రగొండపాలెం, దోర్నాల తదితర ప్రాంతాలతో పాటు నల్లమల అటవీ సమీప గ్రామాలపై నిఘాపెట్టాం. ఇప్పటికే గంజాయి సాగుచేసిన వారిని గుర్తించి జైలుకు పంపాం. మార్కాపురం పట్టణంలో కూడా గంజాయి అమ్ముతున్న మహిళను అరెస్టు చేశాం. గంజాయి సమాచారముంటే మాకు తెలియజేయండి. వారి పేర్లను రహస్యంగా ఉంచుతాం.

– రాగమయి, సెబ్ సీఐ, మార్కాపురం.

పర్యాటక కేంద్రాలుగా బీచ్‌ల అభివృద్ధికి ప్రణాళికలు



పాకల బీచ్‌లో పర్యాటకులతో మాట్లాడుతున్న బృంద సభ్యులు

సింగరాయకొండ: జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలను పరిశీలించి బీచ్‌లు, రిసార్ట్స్‌ల అభివృద్ధికి అనువైన ప్రాంతాలను పరిశీలిస్తున్నామని నెల్లూరు జిల్లా ముత్తుకూరు ఫిషరీస్ సైన్స్ కాలేజి డీన్ ప్రొఫెసర్ డీ రవీంద్ర కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని పాకల, ఊళ్లపాలెం సముద్ర తీరాలను ఆదివారం ప్రత్యేక బృందం పరిశీలించింది. బృందం సభ్యులు రవీంద్ర కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సముద్ర తీర ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయటానికి నిర్ణయించిందని ఈ సందర్భంగా తమ బృందం పర్యటించి ఏయే ప్రాంతాలు అనువుగా ఉన్నాయో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని వివరించారు. మత్స్యకారుల జీవనోపాధికి ఎటువంటి ఇబ్బంది లేకుండా బీచ్‌లను అభివృద్ధి చేయటమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని, గతంలో కర్ణాటక, ఒడిశాలలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బీచ్‌లను అభివృద్ధి చేశారని, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే విధానాన్ని అవలంబించి బీచ్‌ల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందని ఆయన వివరించారు. ఈ బృందంలో డాక్టర్ ఎస్ మాధవన్, జిల్లా పర్యాటకశాఖ అధికారి కే బెన్‌హర్, ఒంగోలు మత్స్యశాఖ అధికారి డీ ఆశ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ఒంగోలు: రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జిల్లా కార్యాలయంలో జరిగిన విస్తృత కార్యవర్గ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని డీఏలను విడుదల చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి, పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఐ.విజయసారథి పాల్గొన్నారు.

గిరిజన గూడేల్లో సంబరాలు

- మంత్రి సురేష్‌కు హారతులు ఇచ్చి స్వాగతం పలికిన గిరిజన మహిళలు
- అభివృద్ధికి బాటలు వేస్తున్నారంటూ.. ఆనందంలో గూడెం వాసులు
- నల్లమలకు చేరిన అన్ని శాఖల అధికారులు

యర్రగొండపాలెం: నల్లమల అటవీ ప్రాంతంలోని గిరిజన గూడేలను సందర్శించిన రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు ఘన స్వాగతం లభించింది. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు అటవీ ప్రాంతంలోనే ఆయన గడిపారు. మండలంలోని పాలుట్ల, పన్నల బయలు, నారుతడికల గిరిజన గూడేలకు వెళ్లిన ఆయనకు గిరిజన మహిళలు హారతులు ఇచ్చి స్వాగతించారు. మండల కేంద్రానికి 65 కిలో మీటర్ల దూరంలో ఉన్న పాలుట్ల గిరిజన గూడేనికి వెళ్లాలంటే అటవీ ప్రాంతంలో 42 కిలో మీటర్ల దూరం గుట్టలు, మిట్టలు, ఏరులు దాటుకుంటూ ప్రయాణించాల్సి ఉంది. అక్కడికి వెళ్లటానికి అధికారులు సైతం వెనుకంజ వేస్తుంటారు. అటువంటిది మంత్రి సురేష్ అన్ని శాఖలకు చెందిన అధికారులను 20 ప్రత్యేక వాహనాల్లో అక్కడికి తీసుకొని వెళ్లారు. జిల్లా, మండల స్థాయి అధికారులతోపాటు వైఎస్సార్ సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను చూసిన గూడెం వాసులు ఆనందం వ్యక్తపరిచారు. రెండు రోజుల పాటు మంత్రి ప్రతి గుడిసె (గడప గడప)కు వెళ్లి ప్రతి గిరిజన కుటుంబాన్ని పలకరించారు. పాలుట్లకు చేరిన ఆయనకు ఊరివెలుపల నుంచి గిరిజనులు పూలు చల్లుకుంటూ, సాంప్రదాయ నృత్యాలు చేస్తూ స్వాగతం పలికారు. గూడెంలోకి వెళ్లిన వెంటనే అటవీ హక్కుల చట్టాలను అమలు చేసిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరింపచేశారు. పాలనకు ప్రతిరూపమైన గ్రామ సచివాలయాన్ని ప్రారంభింప చేసుకున్నారు. మార్కాపురం సబ్ కలెక్టర్ సేథు మాధవన్, డీవైఎస్పీ వీరరాఘవరెడ్డి, శ్రీశైలం ఐటీడీఏ పీవో బి.రవీంద్రరెడ్డిలు మంత్రి వెంట ఉండటాన్ని చూసిన గిరిజనులు తమ గూడెంలకు మంచి రోజులు వచ్చాయని, తమ సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. వారి నమ్మకానికి అనుగుణంగా మంత్రి అభివృద్ధికి బాటలు వేస్తూ కచ్చితమైన హామీలు ఇచ్చారు. విద్యుత్ సౌకర్యం కల్పించడం, పీహెచ్‌సీని గిరిజన గూడెంలోనే ఏర్పాటు చేయడం, ఇంటి పట్టాలు పంపిణీ చేయడమే కాకుండా గృహాలు నిర్మించి ఇస్తామని హామీ ఇవ్వడం గిరిజనులకు ఆనందాన్ని కలిగించింది. పన్నలబయలు వెళ్లిన మంత్రితోపాటు ఆయన తనయుడు ఆదిమూలపు విశాల్‌తో అక్కడి చెంచులు విల్లు ఎక్కుపెట్టించారు. శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అక్కడి గర్భిణులకు ఆయన పౌష్టికాహారాన్ని అందచేశారు. గిరిజనుల పనిదినాలను పెంచాలని అధికారులను ఆదేశించారు. నల్లమల అటవీ ప్రాంతానికి వెళ్లిన మంత్రి ఆదివారం రాత్రి యర్రగొండపాలెంలోని తన క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు.



పాలుట్లలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి సురేష్



విల్లు ఎక్కుపెడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్



డ్రమ్ములు వాయిస్తూ మంత్రి సురేష్‌కు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకే గడప గడపకు



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: నల్లమల అడవుల్లో నివశించే గిరిజనుల సమస్యలను పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని పాలుట్ల గిరిజన గూడెంలో రెండో రోజు ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యర్రగొండపాలెం నియోజకవర్గం పూర్తిగా వెనకబడిన ప్రాంతమని, ఈ ప్రాంతానికి అధికారులు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కరించటానికి ఎవరూ ఇష్టపడరని, ఇటువంటి తరుణంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు కార్యక్రమాన్ని చేపట్టి తామందరినీ మీ ఇళ్ల వద్దకు పంపుతున్నారని చెప్పారు. పాలుట్ల, పొన్నలబయలు, నారుతడికల గిరిజన గూడెంలలో పెండింగ్‌లో ఉన్న ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాల సమస్యపై కలెక్టర్, సబ్ కలెక్టర్లతో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. భూమి పట్టాలతోపాటు గృహాలు నిర్మించుకోవటానికి స్థలాలు అడుగుతున్నారని, అర్హులైన వారందరికీ ఇంటి స్థలాలు ఇవ్వడమే కాకుండా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి పంపిణీ చేస్తామని చెప్పారు. అడవుల్లో నివశించే వారికి నిత్యం పనులు దొరకటం కష్టమని, ఉపాధి హామీ పథకం కింద 100 రోజులు పనులు పూర్తి చేసుకున్న వారికి మరో 50 రోజులు పనిదినాలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం 8 మందికి 150 పనిదినాలు కల్పించేలా పత్రాలు అందజేశామని తెలిపారు. పాలుట్ల గిరిజన గూడెంలో సోలార్ వెలుగులు ఉన్నా అవి చెడిపోతే మరమ్మతులు చేయటానికి సుదూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తుందని, అప్పటి వరకు గూడెం వాసులు చీకట్లో మగ్గడమే కాకుండా జంతువులు ఎప్పుడు దాడి చేస్తాయన్న ఆందోళనతో గడపాల్సి వస్తుందన్నారు. ఆయిల్ ఇంజన్లతో మోటార్లు ఆడించి పంటలు పండించుకుంటున్నారని, దీనివలన ఎక్కువ ఖర్చవుతుందని పలువురు రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఈ సమస్యలు పరిష్కరించేందుకు పాలుట్ల గిరిజన గూడెంలో విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. అడవుల్లో నివశించే గిరిజనులు అడవులకు నష్టం వాటిల్లేలా ప్రవర్తించవద్దని, అడవులను, అటవీ జంతువులను కాపాడుకోవడం తమ అందరి బాధ్యత అని ఆయన సూచించారు. ఫారెస్ట్ అధికారుల వలన ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అక్రమ కేసులు బనాయించి గిరిజనులను ఇబ్బంది పెట్టే వారిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిన ప్రతి సచివాలయ పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకు జగనన్న రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నారని, ఆ నిధులతో గిరిజన గూడెంలలో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాస రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.సుబ్బారెడ్డి, పాలుట్ల సర్పంచ్ హనిమిబాయి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర డైరెక్టర్ పి.రామారావు, ఎస్టీ సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, నాయకులు ఎన్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఏకుల ముసలారెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, ఎంపీడీవో వై.వి.నాగేశ్వర ప్రసాద్, హౌసింగ్ డీఈ సురేష్ బాబు, డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారి సుబ్బారావు, ఐటీడీఏ ఏపీవోలు మురళీధర్, నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీవో పద్మ, పీఆర్ డీఈ సుబ్బారెడ్డి, ఏఈ సుబ్బయ్య, ఈవోఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి, ఏఈలు అల్లూరయ్య, శ్రీకాంత్, లక్ష్మిరెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శరవేగంగా వెలిగొండ ప్రాజెక్టు కాలువ నిర్మాణం




వెలిగొండ ప్రాజెక్టు నీటి కాలువపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రైలు మార్గం



బ్రిడ్జి అడుగున కాలువ నిర్మాణం



వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన నీటి కాలువ



సంగపేట నుంచి మోక్షగుండం వరకూ కొండకు సొరంగ మార్గం

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లె పంచాయతీ పరిధిలోని సంగపేట గ్రామ సమీపంలో వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన నీటి కాలువల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. కంభం పెద్ద చెరువు నుంచి నల్లకాలువ, జగ్గంబొట్లకృష్ణపురం మీదుగా సంగపేట గ్రామ సమీపంలోని కొండకు భారీ రంధ్రాన్ని తవ్వి బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండం వరకు కాలువను ఏర్పాటు చేశారు. సంగపేట గ్రామ సమీపంలో వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన నీటి కాలువపై గుంటూరు మీదుగా నంద్యాల వయా హైదరాబాద్ వెళ్లే రైలు మార్గం ఉంది. దీంతో కింద నుంచి వెలిగొండ ప్రాజెక్టు నీటి కాలువ నుంచి నీరు ప్రవహించేందుకు, పైన రైలు మార్గం వెళ్లేందుకు భారీ వంతెనలు ఏర్పాటు చేశారు. పెద్ద, పెద్ద జాకీల సహకారంతో వంతెనలను ముందుకు తీసుకెళ్లేందుకు చురుగ్గా పనులు జరుగుతున్నాయి.

క్లుప్తంగా

ముండ్లపాడులో వ్యక్తి హత్య


సంజీవయ్య మృతదేహం

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడులో పశువుల దళారీగా పనిచేసే వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు కర్రలతో కొట్టి హత్య చేశారు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన అనంత సంజీవయ్య(52) అనే వ్యక్తి వృత్తి రిత్యా పశువులను కొనుగోలు చేస్తూ జీవనం చేస్తుంటాడు. ఈ క్రమంలో సంజీవయ్య అతడి స్నేహితులతో కలిసి మద్యం తాగి ఘర్షణ పడగా.. అతడిపై దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాలతో ఇంటి సమీపంలోని చెట్టు అరుగుపై పడి ఉన్న సంజీవయ్యను బంధువులు గమనించి చికిత్స నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, సీఐ దేవ ప్రభాకర్, ఎస్సై బ్రహ్మనాయుడుల ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలపై ఆరాతీస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు 21 మంది ఎంపిక


తైక్వాండో పోటీలో తలపడుతున్న విద్యార్థులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను దొనకొండ పీహెచ్‌సీ డాక్టర్ సునీత, డాక్టర్ ఆరవీటి విష్ణుచైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. తైక్వాండో జిల్లా కోచ్ ముఖేష్ మాట్లాడుతూ.. పశ్చిమ ప్రకాశంలో తొలిసారి తైక్వాండో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మార్కాపురం, చీరాల, చినగంజాం, కందుకూరు నుంచి క్రీడాకారులు పాల్గొనగా, జూనియర్ విభాగంలో ఏడుగురు, క్యాడెట్ విభాగంలో 14 మందిని ఎంపిక చేసినట్లు వివరించారు. వీరు జూలై 15, 16వ తేదీల్లో విజయనగరంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి, రాక్‌వెల్ విద్యా సంస్థల చైర్మన్ వెన్నా నాగార్జునరెడ్డి బహుమతులు అందజేశారు. కోచ్‌లు కాళంగి శ్రీనివాసులు, తాళ్లూరి రాంబాబు, పాణ్యం వేణు, అఖిల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న టిప్పర్

● ఒకరికి తీవ్ర గాయాలు



సింగరాయకొండ: మరమ్మతుల కారణంగా రోడ్డు పక్కన నిలిపి ఉంచిన సన్‌ఫ్లవర్ ఆయిల్ ట్యాంకర్‌ను టిప్పర్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్‌కు స్వల్పంగా, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం జాతీయ రహదారిపై కలికవాయ ఫ్లైఓవర్‌పై చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న సన్‌ఫ్లవర్ ఆయిల్ ట్యాంకర్ కలికవాయ ఫ్లైఓవర్ పైకి రాగానే మరమ్మతులకు గురై ఆగిపోయింది. ఈ ట్యాంకర్‌ను హైవే సిబ్బంది క్రేన్ సాయంతో రోడ్డు మార్జిన్‌లోకి జరిపి హెచ్చరిక కోన్‌లు కూడా ఏర్పాటు చేశారు. ఒంగోలు వైపు వెళ్తున్న టిప్పర్ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ఆయిల్ ట్యాంకర్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో టిప్పర్ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. క్లీనర్ మహమ్మద్ హఫీజ్‌కు తీవ్రగాయాలు కాగా డ్రైవర్ ప్రేమ్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు.

డీఎస్సీ 98 ఉపాధ్యాయుడు మృతి

● శనివారమే పోస్టింగ్ ఉత్తర్వులు..


మృతిచెందిన రమణయ్య

ఒంగోలు: డీఎస్సీ 1998 ఉపాధ్యాయుడు ఎన్‌వీ రమణయ్య (53) ఆదివారం ఉదయం ఒంగోలులోని తన నివాసంలో కన్నుమూశారు. రమణయ్య విభిన్న ప్రతిభావంతుడు. శనివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో పుల్లలచెరువు మండలం గంగవరం మండల ప్రాథమిక పాఠశాలకు కేటాయించబడి పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్నారు. ఎన్నో ఏళ్లుగా పోస్టింగ్ కోసం ఎదురుచూసి తీరా ఉత్తర్వులు అందుకుని ఉద్యోగంలో చేరకుండానే మృతి చెందడం బాధాకరమని డీఎస్సీ 1998 ఉపాధ్యాయుల సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాణాలు.. నీటి బుడగలు!

● సముద్ర తీరంలో గల్లంతవుతున్న జీవితాలు
● మెరైన్ పోలీసుల హెచ్చరికలూ బేఖాతరు
● యువకుల అజాగ్రత్తతో తల్లిదండ్రులకు కడుపుకోత



కళ్లెదుట కనువిందు చేస్తున్న కడలి అలలను చూడగానే సరదా..! గలగలమంటూ సవ్వడి చేస్తూ ప్రవహించే వాగులు, కాలువలను చూస్తే ఉత్సాహం..!! వెంటనే లోపలికి దూకాలి.. ఈదేయాలనే ఆతృత అందరికీ ఉంటుంది. అయితే సరదా విషాదంగా మారకూడదు. ఈదే సామర్థ్యం లేకపోయినా.. అతి విశ్వాసంతో నీటిలోకి దిగి ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు తరచూ పునరావృతమవుతున్నాయి. యువత అజాగ్రత్త కన్నవాళ్లకు కడుపుకోత మిగులుస్తోంది.

ఒంగోలు టౌన్: జిల్లాలో కొత్తపట్నం బీచ్ రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి పొందింది. దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలో 70 కి.మీటర్ల విస్తరించిన తీరప్రాంతం ఏడాది పొడవునా పర్యాటకులతో కిటకిటలాడుతోంది. వేసవి సెలవుల్లో అయితే రోజూ సమారు 15 వేల మందికి పైగా వస్తుంటారని అంచనా. కొత్తపట్నం బీచ్‌తోపాటు నాగులుప్పలపాడు మండలం కనపర్తి, సింగరాయకొండ మండలంలోని పాకల, ఈతముక్కల బీచ్‌లకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు వచ్చి సేద తీరుతుంటారు. ఈ క్రమంలో కడలి కెరటాలను చూసి కేరింతలు కొడుతూ లోనికి వెళ్తున్న కొందరు.. ఈత రాక ప్రాణాలు కోల్పోతున్నారు.

విన్యాసం.. విషాదం!

సముద్ర తీరంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకోవడం గత కొన్నేళ్లుగా ఫ్యాషనైపోయింది. స్నేహితులతో కలిసి కేక్ కట్ చేయడం, ఆ తర్వాత మద్యం సేవించి సముద్రంలోకి దిగి విన్యాసాలు చేయడం పరిపాటిగా మారింది. కొంత మంది యువకులకు ఈత రాకపోయినా స్నేహితుల ఒత్తిడితో లోపలికి వెళ్లి రాకాసి అలలకు బలవుతున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కొత్తపట్నం, రామాయపట్నంలోని మెరైన్ పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది గస్తీ తిరుగుతున్నా కొందరు యువకులు వారి కళ్లుగప్పి అలలకు ఎదురుగా మరింత లోనికి వెళ్తున్నారు. అలల తాకిడికి తాళలేని వారు బయటపడే జాగ్రతలు తెలియక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కేవలం సముద్రాల వద్ద మాత్రమే ఇలాంటి పరిస్థితి ఉందనుకుంటే పొరపాటే. గ్రామాలు, పట్టణాల శివారు ప్రాంతాల్లో కుంటలు, కాలువలు, చెరువులు, దిగుడు బావులు, వాగుల్లో దిగి పదుల సంఖ్యలో చిన్నారులు, యువకులు మృత్యువాత పడ్డారు.

➤ జూన్ 4 : కొత్తపట్నం బీచ్‌లో కొక్కిలగడ్డ జితేంద్ర సాయి, అవనిగడ్డ కార్తీక్ ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. జితేంద్రను స్థానిక మత్స్యకారుడు రక్షించి, ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కార్తీక్ మృతదేహం మరుసటి రోజు గుండమాల తీరంలో తేలింది.

➤ జూన్ 10 : ఒంగోలు నగరంలోని ఓ డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న జేసుదాసుది మధ్య తరగతి కుటుంబం. ఏడేళ్ల క్రితం తండ్రి మృతి చెందడంతో తల్లి, ఇద్దరు సోదరీమణులను పోషించే బాధ్యత అతడిపై పడింది. ఓ వైపు చదువుకుంటూనే మరోవైపు పార్ట్‌టైం ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ పరిచయమయ్యాడు సుదర్శన్. అతడిదీ ఇలాంటి కథే. తండ్రి మరణించడంతో సోదరుడు సురేష్, అమ్మ వెంకటరత్నంతో కలిసి జీవిస్తున్నాడు. ఇంటర్ వరకు చదువుకున్నాడు. సోదరుడికి చేదోడు వాదోడుగా ఉండేందుకు ఒక కమ్యూనికేషన్ కంపెనీలో కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తున్నాడు. మరో మిత్రుడు శశికుమార్‌తో కలిసి కొత్తపట్నం బీచ్‌కు వెళ్లారు. అక్కడ పోలీసులు ఉండటంతో పక్కనే ఉన్న ఈతముక్కల సమీపంలోని చెంచుపాపాయిపాలెం దగ్గర సముద్ర తీరంలో జేసుదాస్, సుదర్శన్ ఈతకు దిగారు. అంతే నీటిలో మునిగిపోయారు.

➤ జూన్ 18 : పొట్ట చేతపట్టుకుని ఉపాధి కోసం వచ్చిన రాజస్థాన్‌కు చెందిన 22 ఏళ్ల రామ్‌లాల్ చీమకుర్తిలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేసేవాడు. ఆదివారం సెలవు కావడంతో మిత్రులతో కొత్తపట్నం బీచ్‌కు వచ్చాడు. లోతు తక్కువగా ఉన్న ప్రాంతంలో ఉండాలని అక్కడే ఉన్న ఏఎస్సై రవి సూచించారు. అయినా రవి అలల తాకిడికి కొట్టుకుపోయాడు. ఇలా గడిచిన ఏడాది వ్యవధిలో 25 మందికి పైగా యువకులు సముద్ర తీరంలో గల్లంతై తల్లిదండ్రులకు పుట్టెడు శోకాన్ని మిగిల్చారు. 2022 జూన్ 11న జరుగుమల్లి మండలం అక్కచెరువుపాలెం గ్రామ సమీపంలోని చెరువులో ఆరుగురు చిన్నారులు ఈతకు దిగారు. వీరిలో చింతల కౌషిక్(16), మున్నంగి శివాజీ(12), మద్దినేని సుబ్రమణ్యం(16), అబ్బూరి హరిభగవాన్‌నారాయణ(11) ప్రాణాలు కోల్పోగా ఇద్దరు బాలికలు మాత్రం స్థానికుడి సాయంతో బతికి బయటపడ్డారు.

స్విమ్మింగ్ పూల్స్ సమస్య

ఈత అనేది సరదా మాత్రమే కాదు అదో క్రీడ. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్విమ్మింగ్ పోటీలు జరుగుతుంటాయి. ఈత వల్ల శరీరం దృఢంగా తయారౌతుంది, గుండెకు, ఊపిరితిత్తులకు మేలు చేస్తుంది. అయితే ఈత నేర్చుకుందామని ఉత్సాహంతో ఉన్నవారికి జిల్లాలో తగినన్ని స్విమ్మింగ్ పూల్స్ లేకపోవడం ఇబ్బందిగా తయారైంది. దీంతో కుంటలు, కాలువల్లో ఈతకు వెళ్తున్న వారు తగిన జాగ్రత్తలు పాటించక ప్రాణాలు కోల్పోతున్నారు.

ప్రథమ చికిత్స ఇలా..

నీట మునిగిన వ్యక్తి శ్వాసకోశాల్లో నీరు చేరుతుంది. అందువల్ల ఊపిరి తీసుకోవడం కష్టంగా మారుతుంది. శ్వాసకోశానికి బురద నీరు అడ్డుపడితే తొలగించే యత్నం చేయాలి. అనంతరం ఆ వ్యక్తిని బోర్లా పడుకోబెట్టి ఓవైపుగా వీపు మీద గట్టిగా నొక్కి అదమాలి. ఇలా చేయడం ద్వారా శ్వాసకోశాల్లోంచి కొంత నీరు బయటకు వస్తుంది. ఇలా తనంతట తాను శ్వాస తీసుకునే వరకు నిమిషానికి 16 నుంచి 18 సార్లు నొక్కాలి. తడిచిన దుస్తులు తొలగించి, సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లాలి.

ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

ఈతకు వెళ్లే ముందు తగిన జాగ్రతలు తీసుకోవాలి. నదులు, కుంటలు, చెరువుల్లో ఈతకు వెళ్లేవారు వాటి లోతుపాతులు తెలుసుకున్న తర్వాతే దిగాలి. ఈత రాని వాళ్లు అసలు చెరువుల్లో దిగకపోవడమే మంచిది. సరదా కంటే ప్రాణం ఎంతో విలువైందన్న విషయం ప్రతి ఒక్కరూ గ్రహించాలి. ఇప్పటికే జిల్లాలోని పోలీసులను అప్రమత్తం చేయడం జరిగింది. జలాశయాల వద్ద ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు అవసరమైన చోట ముళ్ల కంచెలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించాం. చిన్నారులు ఈతకు వెళ్లకుండా తలిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. – ఎస్పీ మలికా గర్గ్


కొత్తపట్నం తీరంలో యువకులకు జాగ్రత్తలు చెబుతున్న మెరైన్ పోలీసులు

పాస్‌వర్డ్‌లు తరచూ మార్చండి


● ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: పాస్‌వర్డ్‌లు తరచుగా మారుస్తూ ఉంటే మంచిదని, సులభమైన పాస్‌వర్డ్‌లు పెట్టుకోవడం వల్ల బ్యాంకు ఖాతాలు హ్యాకింగ్‌కు గురయ్యే ప్రమాదం ఉందని ఎస్పీ మలికా గర్గ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. బ్యాంకు అకౌంట్లు, ఫోన్‌పే, గూగుల్ పే లాంటి నెట్ బ్యాంకింగ్, ఇతర సోషల్ మీడియా ఖాతాలకు సంబంధించి పాస్‌వర్డ్ విషయంలో చాలా జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. బలహీనమైన పాస్‌వర్డ్‌లు ఉన్న ఖాతాలను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి సులువుగా డబ్బు కాజేస్తున్నారని పేర్కొన్నారు. కనుక పాస్‌వర్డ్‌లను ఇతరులు గుర్తు పట్టలేని విధంగా పెట్టుకోవాలని సూచించారు.

ఇలా చేయండి చాలు..

▶ పాస్‌వర్డ్‌లో కనీసం 8 క్యారెక్టర్లు ఉండేలా చూసుకోవాలి. అంతకంటే ఎక్కువ ఉన్నా మంచిదే.
▶ పాస్‌వర్డ్‌లో అప్పర్ కేస్ అక్షరాలు, లోయర్ కేస్ అక్షరాలు, అక్షరాలతోపాటు సింబల్స్ వాడి పాస్‌వర్డ్ పెట్టుకోవడం మంచిది.
▶ మీ ఇంటి పేరు, ఇంటి సభ్యుల పేర్లు, సెలబ్రిటీల పేర్లు, మీ పిల్లల పేర్లు, మీ గ్రామం, మొబైల్, వాహనం నంబర్, డోర్ నంబరు లాంటి కామన్ పాస్‌వర్డ్‌లు పెట్టుకోవద్దు.
▶ అన్ని ఖాతాలకు ఒకే పాస్‌వర్డ్ పెట్టుకోవడం ఏ మాత్రం మంచి నిర్ణయం కాదు. తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.
▶ మీ పాస్‌వర్డ్‌ను ఎవరికీ షేర్ చేయవద్దు. మీ వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచుకోండి.
▶ ఇంటర్నెట్ కెఫే, ఇతరుల ల్యాప్‌ట్యాప్‌లు, మొబైల్ ఫోన్లలో డిజిటల్ అకౌంట్లను ఓపెన్ చేసి వాడిన తర్వాత తప్పక సైన్ అవుట్ అవ్వాలి. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.

గంజాయి సమాచారం ఇస్తే పారితోషికం

ఒంగోలు టౌన్: గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం అందించిన వారికి తగిన పారితోషికం ఇస్తామని ఎస్పీ మలికా గర్గ్ తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. హెరాయిన్, కొకైన్, గంజాయి, నాటుసారా లాంటి మత్తు పదార్థాలు మనిషి మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, దీనికి బానిసలైన వారిలో ఆలోచనా శక్తి నశించి నేరాల బాట పడుతున్నారన్నారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా కొందరు వ్యక్తులు మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారని, యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత చెడు దారుల్లో వెళ్లకుండా సరైన మార్గంలో నడుచుకోవాలని, ఉన్నత చదువులు చదువుకుని భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలు విక్రయించి సొమ్ము చేసుకుందామని ఎవరైనా అమాయక ప్రజలు, యువకులు, విద్యార్థులను తప్పుదోవ పట్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, మాదకద్రవ్యాలకు సంబంధించి కచ్చితమైన సమాచారం అందించిన వ్యక్తులకు తగిన పారితోషికం అందిస్తారని, అటువంటి సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. డయల్ 112 కు కానీ, పోలీసు వాట్సాప్ నంబరు 9121102266 కు సమాచారాన్ని అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

నేడు డక్ హేచరీస్ యూనిట్లు ప్రారంభం

● డీఆర్‌డీఏ పీడీ బాబూరావు వెల్లడి

సింగరాయకొండ: మండలంలోని కనుమళ్ల పంచాయతీ పెద్ద కనుమళ్లలో సోమవారం సాయంత్రం 4 గంటలకు డక్ హేచరీస్ యూనిట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ బి.బాబూరావు తెలిపారు. పెద్ద కనుమళ్ల గ్రామంలోని ఎస్టీ డ్వాక్రా మహిళలు పీఎంఈజీపీ పథకం కింద సెర్ప్, బ్యాంకుల సహకారంతో 11 డక్ హేచరీస్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు సుమారు రూ.10 లక్షల వ్యక్తిగత రుణాలు ఇచ్చామని తెలిపారు. ఈ యూనిట్లను రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ప్రిన్సిపల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరకూటి అశోక్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభిస్తారని, సెర్ప్ సీఈఓ ఇంతియాజ్, కలెక్టర్ దినేష్‌కుమార్ పాల్గొంటారని వివరించారు.


డక్ హేచరీస్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

సెర్ప్ ద్వారా డ్వాక్రా మహిళల కోసం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల గురించి అవగాహన కల్పిస్తారని తెలిపారు. డీఆర్‌డీఏ డీపీఎం సుబ్బారావు, డేవిడ్, ఏపీఎం డి.జయరాజ్, సీసీలు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ.. దేశంలో చీకటి అధ్యాయం

● నాటి పరిస్థితులు మరలా పునరావృతం కానివ్వం
● ప్రజాస్వామ్యాన్ని కాలరాసేలా ఎమర్జెన్సీ సృష్టించిన ఇందిరాగాంధీ
● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

ఒంగోలు: దేశంలో ఎమర్జెన్సీ చీకటి అధ్యాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కాలేజీలోని ఆదివారం సమావేశ మందిరంలో ఎమర్జెన్సీడేపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో పౌరుని ప్రాథమిక హక్కులు హరించేలా అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారన్నారు. ఆ సమయంలో ప్రశ్నించిన మేధావులను, ప్రతిపక్ష సభ్యులను జైలుకు పంపారన్నారు. ప్రకాశం జిల్లాలో కూడా విద్యా సంస్థను నిర్వహిస్తున్న జి.జయరామయ్యను కూడా నాడు ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడనే ఉద్దేశంతో అరెస్టుచేసి జైలుకు పంపారన్నారు. ఇలాంటి పరిస్థితులలో లోక్ సంఘర్షణ్ సమితి ఏర్పాటై దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేసేందుకు తీవ్రంగా కృషి చేసిందన్నారు. ఎమర్జెన్సీ నాటి పరిస్థితులకు వ్యతిరేకంగా , ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకోసం బీజేపీ ఆవిర్భవించిందని, ప్రధాని నరేంద్రమోదీ కూడా గుజరాత్‌లో నాటి లోక్ సంఘర్షణ్ సమితి సభ్యునిగా పనిచేశారన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లంకా దినకర్, జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఒంగోలు పార్లమెంట్ అధికారప్రతినిధి సెగ్గెం శ్రీనివాసరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పీవీ కృష్ణారెడ్డి, ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జి యానం చినయోగయ్య యాదవ్ తదితరులు పాల్గొని నాటి చీకటి పరిస్థితులను ఎదుర్కొన్న జి.జయరామయ్య, కురుగంటి శ్రీరామశర్మ, మండువ నాగేశ్వరరావులను ఘనంగా సత్కరించారు.

మోదీ పాలనలో దేశం ప్రగతిపథం

ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ సమావేశ మందిరంలో ఆదివారం ఆడిటర్లు, అడ్వకేట్లు, ఇంజనీర్లు, సైంటిస్ట్‌లతో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మోదీ పాలన కామన్‌మ్యాన్ అవసరాలను నెరవేరుస్తూ ప్రజలకు పాలన చేరువైందన్నారు. జిల్లాలో 50వేల మంది రైతులు కిసాన్ సమ్మాన్ నిధి నుంచి లబ్ధి పొందుతున్నారని, ఆయుష్మాన్ భారత్ పథకం, ఒంగోలు జిల్లాలో గిద్దలూరు జాతీయరహదారి నిర్మాణం తదితర పథకాలన్నీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్నవేనన్నారు. సైంటిస్ట్ సుబ్బారావు మాట్లాడుతూ మేకిన్ ఇండియా ప్రాజెక్టు ద్వారా రూ.200కోట్లతో రాడార్ వ్యవస్థను తయారు చేశామన్నారు. అమెరికా, జపాన్, చైనా, ఫ్రాన్స్ తరువాత రాడార్‌ను సొంతంగా కలిగి ఉన్న దేశం మనదేనని పేర్కొన్నారు. మంగళయాన్, చంద్రయాన్ విజయవంతంగా ప్రయోగించిన విషయాలను ప్రస్తావించారు. ఆడిటర్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఇండియన్ ఎకానమీ బలోపేతమైందన్నారు. ప్రాధాన్యతా రంగాలకు పెద్ద పీట వేశారని, విద్యుత్‌ను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామన్నారు. వృద్ధి రేటు సాధించామంటూ పలు అంశాలను వివరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి, అడ్వకేట్ నాగిశెట్టి మోహన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.


ఎమర్జెన్సీ సమయంలో అరెస్టు అయిన జి.జయరామయ్య, తదితరులను సత్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు